క్లుప్తంగా

పనిచేసే వారికి ప్రాధాన్యతనివ్వాలి

చిట్యాల : కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేలా పనిచేసే వారికి రాబోయే రోజుల్లో పార్టీ పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో మొదటి ప్రాధాన్యత నివ్వాలని కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి పోకల దేవదాసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నలభై ఏళ్లుగా పార్టీలు మారకుండా గత పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీపై పోరాటాలు చేసిన కాంగ్రెస్‌పార్టీ నాయకులను, కార్యకర్తలను పదవుల్లో ఇచ్చే క్రమంలో మొదటగా గుర్తించాలని ఆయన కోరారు. పార్టీ నాయకులు షోపుటాప్ రాజకీయాలను మానుకోవాలని ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించటంతో పాటు నిజమైన కార్యకర్తలను గుర్తించాలని పేర్కొనడంతో గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న పార్టీ కార్యకర్తల్లో నూతనోత్తజం నింపినట్లు తెలిపారు.

కేసు నమోదు

నకిరేకల్ : ఇరువురి మధ్య జరిగిన వివాదంలో రిటైర్డ్ ఉద్యోగిపై చేయి చేసుకున్న ఘటనలో మరోకరిపై కేసు నమోదు చశామని నకిరేకల్ సీఐ రాజశేఖర్ వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకిరేకల్‌లోని రిటైర్డు ఉద్యోగుల సంఘం భవనాన్ని కొన్నేళ్ల క్రితం ఇద్దరు కలిసి మరోకరికి రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. ఈ విషయంలో సంఘం భవనం సంఘానికే వర్తించేలా సంఘ కార్యదర్శి కందుల సోమయ్య కోర్టుకు వెళ్లి గతంలోనే ఆదేశాలు తెచ్చాడని సీఐ తెలిపారు. ఈ సంఘ భవన రిజిస్ట్రేషన్ మార్పిడి విషయంలో నకిరేకల్‌కు చెందిన పి. పార్థసారథికి కందుల సోమయ్య మధ్య మనస్పర్ధలు ఉన్నాయని తెలిపారు. శనివారం నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో వీరిద్దరూ కలసుకున్న క్రమంలో మాట మాట పెరిగి సోమయ్యపై పార్థసారథి చేయి చేసుకున్నట్లు తెలిపారు. సోమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తనపై కూడా సోమయ్య చేయి చేసుకున్నాడని నేను కూడా పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశానని పార్థసారథి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలను పూర్తి చేసుకోవాలి


ముస్లింలతో కలిసి నమాజ్ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలను భక్తిశ్రద్ధలతో విజయవంతంగా పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నుంచి రంజాన్ మాసన ఉపవాస దీక్షలు ప్రారంభోత్సవం సందర్భంగా ఉదయం 5.30గంటలకు పట్టణంలోని సీతారాంపురం చిన్న మసీదులో ఎమ్మెల్యే ప్రత్యేక నమాజ్ చేసి చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ప్రతిరోజు అల్లాను స్మరించుకుంటూ కఠినమైన ఉపవాస దీక్షలను పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు సెలవు ప్రకటించాలి


మాట్లాడుతున్న బైరం దయానంద్

మిర్యాలగూడ : మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ మహిళా కార్మికులకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ అన్నారు. ఆదివారం దామరచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను అందించాలని, బట్టలు, డ్రెస్‌కోడ్, గ్లౌజులు, కొబ్బరి నూనె అందించాలన్నారు. కార్యక్రమంలో పాతులోతు విజయ్‌కుమార్, గుండు వెంకటేశ్వర్లు, అక్కెనపల్లి సైదులు, ముడుసు సైదులు, ఎండీ.జైరుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యంపై అవగాహన సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోకల వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ : విద్యార్థినులు మంచి జీవన నైపుణ్యాన్ని అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని అవంతీపురంలో గల కేజీబీవీలో విద్యార్థినులకు జీవన నైపుణ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు పట్టుదల, ఓర్పు, విశ్వాసంతో అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. మొబైల్ కోరల్లో బాల్యం చిక్కుకుందుని, దీని ద్వారా బాల్యంతోనే హింసాత్మక ప్రవర్తనకు గురవుతున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భవాని, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిధులు గడువులోగా ఖర్చయ్యేనా!

- మునుగోడు డివిజన్‌కు ఉపాధి హామీ నుంచి రూ.1.56కోట్లు మంజూరు
- మార్చి 31లోగా పనులు పూర్తి చేస్తేనే బిల్లులు
- పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు


కిష్టాపురంలో ఉపాధి హామీ నిధుల ద్వారా వేసిన సీసీ రోడ్డు

మునుగోడు : ఇటీవల మునుగోడు డివిజన్‌లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు నిధులు ఖర్చవడం కష్టతరంగా కనిపిస్తుంది. సీసీ రోడ్లు పనులు ముందుకు సాగక పోవడం, ప్రభుత్వం ప్రతిఏటా జనవరి లేదా ఫిబ్రవరి మాసంలో ఉపాధిహామీ నిధులు నుంచి సీసీ రోడ్లు నిర్మాణానికి కొంత నగదు మంజూరు చేస్తుంది. అయితే ఆ పనులు మార్చి 31వ తేదీ లోపు పూర్తిచేస్తే ఆ రోడ్లు వేసినా కాంట్రాక్టర్‌కు బిల్లులు అందుతాయి. ఆ తరువాత పనులు చేస్తే బిల్లులు వచ్చేందుకు నెలలు గడుస్తుంది. దీంతో గతేడాది క్రితం వరకు గ్రామాల్లో నిధులు మంజూరైనా వెంటనే సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేసేది. కానీ ఈ ఏడాది మాత్రం అందుకు పూర్తిగా విరుద్ధంగా ఉంది. నిధులు మంజూరై నెల రోజులకు పైగా పూర్తయినా పనులు ఇంక మొదలు పెట్టేందుకు మీనా మేషాలు లెక్కిస్తున్నారు. దీంతో ఈ ఏడాది ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైనా నిధులు ఖర్చుచేయడం కష్టంగా ఉందని పలువురు వాపోతున్నారు.

కాంట్రాక్టర్లపై ఒత్తిడి

మునుగోడు డివిజన్ పరిధిలోని చండూరు, మునుగోడు మండలాలల్లోని గ్రామాలల్లో సీసీ రోడ్లు నిర్మాణానికి ఈ ఏడాది ఈ ఏడాది రూ. 1. 56కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే అందులో మునుగోడు మండలంలోని 16 పనుల రూ. 81లక్షలు మంజూరు కాగ అందులో బీరేల్లిగూడెం గ్రామ పంచాయతీ భవనానికి రూ. 20లక్షలు, మిగిలిన 15పనులు సీసీ రోడ్లకు రూ. 61లక్షలు చొప్పున మంజూరయ్యాయి. చండూరు మండలంలో 19గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 75 లక్షల చొప్పున మంజూరయ్యాయి. కానీ వెంటనే ఆ పనులు మార్చి 20వతేదీ లోపు పూర్తి చేయాలని గత నెల రోజుల కాలంగా సంబంధిత అధికారులు కాంట్రాక్టర్లపై వత్తిడి చేస్తున్నారు. దీంతో మునుగోడు మండలంలో 5 గ్రామాలల్లో, చండూరు మండలంలో 6గ్రామాల్లో మాత్రమే పనులు చేశారు. ఇంకా మునుగోడు మండలంలో 10 పనులు, చండూరు మండలంలో 13 పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

సకాలంలో బిల్లులు అందకపోవడమేనా..

రెండేళ్ల కాలంగా గ్రామాల్లో ఏ అభివృద్ధి పనులు చేసినా సకాలంలో బిల్లులు అందడం లేదని పలువురు చెప్పుకుటున్నారు. దీంతో పనులు చేసినందుకు తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి చివరికి లాభం రాకపోగా నష్టం వస్తుందని వాపోతున్నారు. అందుకే ఆ పనులు చేయాలంటే భయంగా ఉందని బాహాటంగా చెబుతున్నారు. పనులు చేసినా రెండు, మూడు నెలల్లో బిల్లులు వచ్చి ఉంటే పనులు చేసేందుకు అనేకమంది పోటీ పడేవాళ్లమంటున్నారు.

మరో రూ. కోటికి ప్రతిపాదనలు సిద్ధం

ప్రస్తుతం మంజూరైనా రూ. 1.56 కోట్లతో పాటు మరో రూ.కోటి నిధులు మునుగోడు డివిజన్‌కు మంజూరు కానున్నాయి. అందుకు అవసరమైనా ప్రతిపాదనలు సైతం సిద్ధం చేసి అధికారులు ఉన్నత అధికారులకు అందజేశారు. ఆ నిధులు కూడ మునుగోడుకు రూ. 50లక్షలు, చండూరు మండలానికి రూ. 50 లక్షల చొప్పున మంజూరు కానున్నాయి. దీంతో ఇప్పటికే మంజూరైన నిధులు ఖర్చు చేసేందుకు అధికారులు పడరాని పాట్లు పడుతుంటే మరికొన్ని మంజూరైతే వాటిని ఎలా ఖర్చు చేయిస్తారనే చర్చ గ్రామాల్లో కొనసాగుతుంది. గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతి నిధులు కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

గడువులోగా ఖర్చు చేస్తాం



డివిజన్ పరిధిలోని రెండు మండలాలకు మంజూరైన నిధులు గడువులోగా ఖర్చు చేస్తాం. మొత్తం 34 పనులకు రూ. కోటి 56 లక్షలు మంజూరుకాగ మునుగోడులో 5 గ్రామాలల్లో రూ. 19 లక్షల నిధులు ఖర్చుచేశాం. అదేవిధంగా చండూరు మండలంలో ఆరు గ్రామాల్లో రూ.30లక్షల నిధులతో రోడ్లు వేయించాం. మార్చి 20వ తేదీలోపు పనులు పూర్తిచేయాలని పనులుచేసేవారిని పదే పదే కొరుతున్నాం. త్వరలో మరో రూ.కోటి నిధులు మంజూరుకానున్నాయి.

– నాగేశ్వరావు, పంచాయతీరాజ్ డీఈ

కనీస మద్దతు ధర చట్టం చేయాలి

నల్లగొండ టౌన్ : పంటలకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం వర్తింపజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ అన్నారు. ఆదివారం నల్లగొండ మండలం చర్లపల్లిలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, డీవైఎఫ్ఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు వర్తింపజేసి 200 రోజులు పనిదినాలు పెంచి రోజు కూలి రూ. 800 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, భూతం అరుణ, నరేష్ , కార్తిక్, గౌతమ్ రెడ్డి, గౌరీదేవి, మధుసూదన్ ,శ్రీనివాస్ రెడ్డి, లోకేష్, శ్రవణ్ పాల్గొన్నారు.

8నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కనగల్ : మండల పరిధిలోని రేగట్టే గ్రామంలోని భవాని శంకర్ స్వామి ఆలయ బ్రహ్మోత్సాలు ఈనెల 8నుంచి 11వరకు నిర్వహించనున్నట్లు దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను వారు ఆదివారం ఆలయం వద్ద ఆవిష్కరించిన సందరభంగా మాట్లాడారు.8న భవాని శంకర్ స్వామి కల్యాణ మహోత్సవం, 10న రథోత్సవం, 11న అగ్నిగుండాలు వంటి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శ్రీపాదరావుకు నివాళి


శ్రీపాదరావు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో దుదిల్ల శ్రీపాదరావు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి మోతిలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

కట్టంగూర్ : అసెంబ్లీ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 88వ జయంతిని కట్టంగూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్రపటానికి ఇన్‌చార్జ్ ఎంపీఓ చింతమల్ల చలపతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు గాలేంక అనిల్, గోవిందరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.


కట్టంగూర్‌లో శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

చర్లపల్లి శివారులో కల్వర్టు నిర్మాణం చేపట్టాలి

నల్లగొండ టౌన్ : చర్లపల్లిలో రైతులు పొలాలకు వెళ్లే మార్గంలో కల్వర్టు నిర్మాణం, సీసీ రోడ్డు వేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం చర్లపల్లిలో సీపీఎం పోరుబాట నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 400మంది చర్లపల్లి రైతులు చెరువు కింద ఉన్న పొలాల దగ్గరికి వెళ్లడానికి చెరువు పక్కన కల్వర్టు నిర్మాణం చేయడం ద్వారా రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. వర్షాకాలంలో రోడ్డు వెంబడి జాలునీరు ప్రవహించి నడవడానికి కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. చెరువు కింద సుమారు 500 ఎకరాల పొలాలకు సంబంధించిన రైతులు ట్రాక్టర్లు ,ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి రోడ్డు గుంతలమయం కావడం చెరువు పక్కన నీరు ఉండడంతో దాటడం ఇబ్బంది పడుతున్నారని అన్నారు. చెరువు పక్కన కల్వర్టు నిర్మాణం చేపట్టి చర్లపల్లి నుంచి చెరువు కట్ట వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ పట్టణ కమిటీ సభ్యులు పిన్నపు రెడ్డి మధుసూదన్‌రెడ్డి, దండంపల్లి సరోజ, అరుణ, గుండాల నరేష్, కార్తీక్, మధుసూదన్, గౌతమ్‌రెడ్డి ఉన్నారు.

స్కౌట్ మాస్టర్ నరహరి మృతి



నల్లగొండ టౌన్ : స్కౌట్స్ అండ్ గైడ్స్ మాజీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మొలకల నరహరి(78) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. ఆయన శివరాత్రి రోజు బ్రహ్మంగారి గుట్టపై దర్శనానికి వెళ్లి వస్తుండగా జారిపడి గాయాలపాలవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆయన భారత్‌స్కౌట్స్ అండ్‌గైడ్స్ లో 50 ఏళ్ల పాటు విశిష్ట సేవలు అందించారు. డ్రాయింగ్ మాస్టర్‌గా ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించి 1987లో స్కౌట్స్‌లో గైడ్‌గా శిక్షణపొందారు. 2004లో రిటైర్ అయ్యి వృత్తిని వదులుకోలేక కార్యదర్శిగా విద్యార్థులకు వాయిద్యాలపై స్కౌట్స్‌పై శిక్షణ ఇచ్చారు. నరహరి 200 పైగా అవార్డులు అందుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా అవార్డులు, నగదు పురస్కారాలను పొందారు. జంబోరిలో భారత్ స్కౌట్స్ బృందంతో పాల్గొని ఆయన ప్రతిభ కనబర్చారు.దీంతోపాటు ఎంతో మంది విద్యార్థులకు స్కౌట్ అండ్ గైడ్స్‌లో శిక్షణ నిచ్చి జాతీయ, అంతర్జాతీయ పోటీలకు పంపారు. 1998లో అప్పటి కలెక్టర్ నుంచి అవార్డు పొందారు. 1990లో అప్పటి మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి చేతుల మీదుగా,1994 లో అప్పటి కలెక్టర్ ఎస్పీ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఇవేగాక జాతీయ అంతర్జాతీయ అవార్డులు కూడా కై వసం చేసుకున్నారు. 2024లో ఇప్పటి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హైదరాబాద్ లో అవార్డు అందజేసి ఘనంగా సన్మానించారు. ఆ యన అంత్యక్రియలు సోమవారం లైన్‌వాడ లోని ఆయన స్వగృహంలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

తైక్వాండోలో బ్రౌంజ్ మెడల్

చిట్యాల : పట్టణానికి చెందిన ఓర్సు రమేష్ కుమారుడు ధావన్ ఈ నెల1, 2వ తేదీల్లో హైదరాబాద్‌లోని కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 13వ ఓపెన్ స్టేట్ తైక్వాండో క్రీడాపోటీల్లో బ్రౌంజ్ మెడల్‌ను సాధించినట్లు ఆదివారం కోచ్ పట్టెడ సుధకార్ తెలిపారు. అండర్ 50 కేజీ విభాగంలో ప్రతిభ కనబర్చి బ్రాంచ్ మెడల్‌ను ధావన్ సాధించటంపై స్టేట్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏ.ప్రవీణ్‌కుమార్, కోచ్‌లు సుధాకర్, ఫణింద్రకుమార్ అభినందించారు.


తైక్వాండోలో బ్రాంచ్ మెడల్‌ను అందుకుంటున్న ధావన్

మాజీ ఉపసర్పంచ్ మొత్తయ్యకు నివాళి


నివాళులర్పిస్తున్న దైదా రవీందర్

చిట్యాల : మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన మాజీ గ్రామ ఉపసర్పంచ్ నాగంపల్లి మొత్తయ్య(69)అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని ఆదివారం టీపీసీసీ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దైదా రవీందర్, డీసీసీ ఉపాధ్యాక్షుడు కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే వేముల వీరేశం భార్య పుష్ప, చిట్యాల ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహాలు ఉన్నారు. మృతుడి కుమారుడు కిశోర్‌ను వారు పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, నీలకంఠం లింగస్వామి, అద్దెల లింగారెడ్డి, రైతు సంఘం నాయకుడు లడే రాములు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలి


'లోకం పోకడ కవిత్వ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణారెడ్డి

నకిరేకల్ : చదువుకున్న పాఠశాల అభివృద్ధికితమ వంతుగా ఆర్థిక సహాయం అందించాలని జిల్లా పరిషత్ రిటైర్డు విద్యాధికారి, 1979–80నాటి నోముల జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ముస్కు క్రిష్ణారెడ్డి కోరారు. నకిరేకల్ మండలం నోముల జెడ్పీహైస్కూల్‌లో 1979–80 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివార నిర్వహించారు. ఈసమ్మేళనంలో భాగంగా పూర్వ విద్యార్థి యరకల యాదయ్య రచించిన 'లోకం పోకడ కవిత్వ' పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు ,రచయితలకు అండదండా ఉండి పుస్తక ముద్రణలకు ప్రోత్సహించాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి విరాళాలు ఇవ్వాలని కోరగా స్పందించిన పూర్వ విద్యార్థులు పన్నాల జనార్దన్‌రెడ్డి రూ.50 వేలు, ముసుకు రమేష్‌రెడ్డి, రూ.50వేలు, గింజల నర్సింహారెడ్డి రూ.10 వేలు, సీహెచ్ చంద్ర మౌళి రూ.20 వేలు చొప్పున విరాళాలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు గింజల నర్సింహారెడ్డి ఆర్వీ ప్రభాకర్‌రావు, కె. వెంటకయ్య, సీహెచ్ చంద్రమౌళి, సుగణ, పూర్వ విద్యార్థులు సంజీవరెడ్డి, రామచంద్ర రావు, కృష్ణయ్య, సత్యనారయణ పాల్గొన్నారు.

విద్యా, ఉపాధి కల్పనతోనే సామాజిక అభివృద్ధి

హాలియా : విద్యా, ఉపాధి కల్పనతోనే సామాజిక అభివృద్ధి సాధ్యపడుతుందని ఏకే ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది కట్టెబోయిన అనిల్‌కుమార్ అన్నారు. ఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని శ్రీ శ్లోక స్కూల్‌లో నిర్వహించిన మేగా జాబ్ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సునీల్‌రావు, రాధిక, రాజిరెడ్డి, శ్లోక్ స్కూల్ అధ్యాపకుడు రాజేష్, నాయకులు రమేష్, ఫౌండేషన్ సభ్యులు కోటి, అనిల్ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపును పరిశీలించాలి


మాట్లాడుతున్న నాయకులు

నల్లగొండ టూటౌన్ : టీచర్స్ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపును జాగ్రత్తగా పరిశీలించాలని మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రామచందర్‌రావు, అభ్యర్థి పులి సర్వోత్తం రెడ్డి, నూకల నరసింహారెడ్డి అన్నారు. నల్లగొండ బీజేపీ కార్యాలయంలో ఆదివారం కౌంటింగ్ ఏజెంట్ల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ అభ్యర్థికి పడే ఓట్లను ఎప్పటికప్పుడు నోటుబుక్‌లో నమోదు చేస్తూ ఏవైనా పొరపాట్లు జరిగేతే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో జాతీయ కిసాన్ మోర్చా కార్యదర్శి గోలి మధుసూదన్ రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా కన్వీనర్ రమణ , జిల్లా ప్రధానకార్యదర్శి లింగస్వామి, తులసి, రవి గౌడ్, కిషన్, భవాని, హరి, శేఖర్, పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం

డిండి: కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తోందని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డిండి మండలం కందుకూర్ గ్రామంలో నిర్వహించిన ఆ సంఘం 8వ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు ఆన్‌లైన్ విధానం రద్దు చేయాలన్నారు. పోరాటాలు చేసి సాధించుకున్న కార్మికుల సంక్షేమ బోర్డు ప్రస్తుతం సమస్యల వలయంగా మారిందన్నారు. అంతకు ముందు ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ , నూనే రామస్వామి, ఎండి.మైనొద్దీన్, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, సాయిలు, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలని ఆందోళన


నకిరేకల్ : గోరెంకలపల్లి శివారులో ఆందోళన చేస్తున్న రైతులు

నకిరేకల్ : వానాకాలం ప్రారంభం నుంచి డి–40 కాల్వద్వారా తమ గ్రామాలకు వచ్చే కాల్వకు సాగునీరు విడుదల చేయడం లేదని ఆరోపిస్తూ నకిరేకల్ మండలం గోరేంకలపల్లి శివారులో తిప్పర్తి–నకిరేకల్ రహదారిపై గోరేంకలపల్లి, మామిడాల రైతులు ఆందోళనకు దిగారు. పానగల్ ఎస్ఎల్‌బీసీ డీ 40 కాల్వ ద్వారా ఎల్–11 కాల్వ తూముకు షట్టర్ అమర్చి నీరు విడుదల చేయడం లేదని ఆరోపించారు. డీ 40 కాల్వ పరిధిలో 39 తూములు ఉండగా కేవలం ఎల్–11 కాల్వ తూముకు మాత్రమే షట్టర్ పెట్టి నీరు రాకుండ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వేంటనే అధికారులు తూము షట్టర్ ను తొలగించి నీరు విడుదల చేయాలని కోరారు.

టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలి


నల్లగొండ : మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నల్లగొండ టౌన్ : పదో తరగతి విద్యార్థులు ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్టును ఉపయోగించుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్ అన్నారు. ఆయన ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను నల్లగొండ పట్టణ కేంద్రంలో గౌతమి స్కూల్ లో ఆదివారం విడుదల చేసి మాట్లాడారు. విద్యార్థులు ఈ పోటీ ప్రపంచంలో నిలబడాలంటే విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి మార్కులతో పాస్ అయి ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంచం కావ్య, ఎం.ఏ సైఫ్ ,మారుపాక కిరణ్, స్పందన, సిరి పాల్గొన్నారు.



నకిరేకల్ : ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న మధుసూదన్‌రెడ్డి

ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్

నకిరేకల్ : విద్యార్థులు ప్రతిభ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్ ప్రశ్న పత్రాలను ఆదివారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముస్కు రవీందర్, ఉపాధ్యాయులు సత్యవతి, శ్రీను, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి యూబీఐ సేవలు

- ఈ నెల 6న బ్రాంచ్ ప్రారంభం
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు



కనగల్ యూబీఐ నూతన బ్రాంచ్

కనగల్ : యూనియన్ బ్యాంకు సేవలు ఖాతాదారులకు మరింత చేరువ చేయాలన్న ఆలోచనతో కనగల్ మండల కేంద్రంలో ఈ నెల 6న యూనియన్ బ్యాంకు సేవలు అందుబాటులోకి తెస్తున్నారు. నిన్నమొన్నటి వరకు నల్లగొండ పట్టణానికి వెళ్లి యూబీఐ(యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా) సేవలను సద్వినియోగం చేసుకున్న రైతులు, ఖాతాదారులు మండల కేంద్రంలోనే ఈ సేవలు అందుబాటులోకి రానుండటంతో ఖాతాదారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. మండలంలో 3500మంది రైతుల క్రాప్‌లోన్లు, సేవింగ్ ఖాతాలు 5000వరకు ఉన్నాయి. ఇక నుంచి వీరందరూ మండల కేంద్రంలోని యూబీఐ బ్రాంచ్‌లో సేవలను సద్వినియోగం చేసుకోనున్నారు.

సంతోషంలో ఆయా గ్రామాల ప్రజలు..

మండల పరిధిలోని ప్రధాన గ్రామాలైన జి యడవల్లి, కురంపల్లి, శాబ్దుల్లాపురం, పొనుగోడు, బచ్చన్నగూడెం, మార్తినేనిగూడెం, రాంచంద్రపురం, రేగట్టే గ్రామస్తులకు ఈ బ్యాంకులోనే నిత్యం సేవలను సద్వినియోగం చేసుకుంటారు. 20నుంచి 30కిలోమీటర్ల మేర జిల్లా కేంద్రంలోని యూబీఐ బ్యాంకు వెళ్లి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మండల కేంద్రంలోనే ఈ సేవలను ప్రారంభిస్తుండంతో వారు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

రద్దీగా నల్లగొండ బ్రాంచ్.

జిల్లా కేంద్రంలోని ప్రకాశం బజార్‌లో ఉన్న యూబీఐ పట్టణ వాసులతో పాటు గ్రామీణ ప్రజలతో నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో ఖాతారులకు మెరుగైన సేవలను సకాలంలో అందక రెండు, మూడు రోజులు తిరిగినా పనులు కాక ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ఆ సమస్య తీరుందని రైతులు ఆనందపడుతున్నారు.

అన్ని సేవలు ఇక్కడి నుంచే..

ఇప్పటి వరకు నల్లగొండ బ్రాంచ్‌లో సద్వినియోగం చేసుకున్న కనగల్ మండలంలోని ఆయా గ్రామాల ఖాతాదారులు ఇక నుంచి మండల కేంద్రంలోనే లావాదేవీలు, క్రాప్‌లోన్లు, గోల్డ్ లోన్లు, ఇతర లోన్లు ఇక్కడి నుంచే పొందాలని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లి ఇబ్బందులు పడే బదులు అందుబాటులో ఉన్న ఈ బ్యాంకులో సేవలను పొందాలన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



మండల కేంద్రంలో ఉన్న ప్రజలతో పాటు దత్తత గ్రామాలైన రైతులు, ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించేందుకు ఈ నెల 6న కనగల్ మండల కేంద్రంలో యూబీఐ నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్నాం . రూ.500లకే మండల ప్రజలకు ఖాతా తెరుచుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాం. మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఖాతాలు తెరిచే విధంగా క్షేత్రస్థాయిల పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కావున ఈ సేవలను మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలి.

– మెహన్ యూబీఐ బ్రాంచ్ మేనేజర్, కనగల్

సంతోషంగా ఉంది

కనగల్ మండల కేంద్రంలో నూతనంగా యూబీఐ బ్రాంచ్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. ప్రతి పనికి జిల్లా కేంద్రంలో ఉన్న యూనియన్ బ్యాంకు వద్దకు వెళ్లి ఇబ్బందులు పడేవాళ్లం. వెళ్లిన పట్టణ ప్రజలతో పాటు గ్రామీణ ప్రజలతో నిత్యం బ్యాంకు రద్దీగా ఉండటంతో పనులు సకాలంలో కాకపోయేవి. ఇప్పుడు ఆ సమస్య రాదు.

– యకాలపు జానకిరాములు, రైతు, శాబ్దుల్లాపురం